ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

ముగ్గురు ఆర్డీవోల బదిలీ

ఒకరికే పోస్టింగ్.. మరో ఇద్దరికి జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశం

ఈనాడు, నెల్లూరు

జిల్లాలో ముగ్గురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. వీరిలో ఒక్కరికి మాత్రమే పోస్టింగ్ ఇచ్చారు. మరో ఇద్దరిని జీఏడీలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఆత్మకూరు ఆర్డీవోగా పని చేస్తున్న కె.మధులతను నరసారావుపేటకు బదిలీ చేయగా.. ఆమె స్థానంలో భూమిరెడ్డి పావనిని నియమించారు. నెల్లూరు ఆర్డీవోగా నాగ సంతోష్ అనూష, కావలి ఆర్డీవోగా సన్ని వంశీకృష్ణను నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న కావలి, నెల్లూరు ఆర్డీవోలు శీనానాయక్, మాలలోకు పోస్టింగ్ ఇవ్వలేదు. వీరిద్దరినీ జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వైకాపా నాయకులతో అంటకాగడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను ధారాదత్తం చేశారనే ఆరోపణలు వీరిపై ఉన్నాయి. కావలి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, కాలువలు, శ్మశానాలు ఆక్రమించి లేఅవుట్లు వేసినా.. కనీస చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో సదరు అధికారి పేరు రెడ్‌బుక్‌లో నమోదు చేసుకున్నట్లు బహిరంగంగానే ప్రకటించారు. ఇక నెల్లూరులో అక్రమ లేఅవుట్లకు నాలా కన్వర్షన్ తగ్గించి కట్టించుకోవడంతో పాటు.. అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోకుండా.. వారిని కాపాడారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వారిద్దరికీ పోస్టింగ్‌లు ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. ఇక తెలుగుగంగ రాపూరు యూనిట్‌లో ఎస్‌డీసీగా పని చేస్తున్న ఎం.శ్రీనివాసులు ఎన్నికల తర్వాత సెలవుపై వెళ్లారు. అప్పటి నుంచి రాజారమేష్‌కు అప్పగించారు. ప్రస్తుతం శ్రీనివాసులును చిత్తూరు ఆర్డీవోగా బదిలీ చేశారు.

అమ్మణ్ణి వైభవం.. అపురూప వీక్షణం

■ కనుల పండువగా పోలేరమ్మ ఊరేగింపు.. ■ భక్తజన సంద్రంగా వెంకటగిరి





వెంకటగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర పండుగైన వెంకటగిరి పోలేరమ్మ జాతర అశేష భక్తజన సందోహం మధ్య గురువారం వైభవంగా జరిగింది. ఊరేగింపులో వీధులన్నీ భక్తులతో నిండాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సారె సమర్పించారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మొక్కులు చెల్లించారు.

నిజరూప దర్శనం: గురువారం వేకువజామున అత్తగారింటి నుంచి పోలేరమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం వద్ద దర్శనార్థం ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని నిజరూపంలో దర్శించుకున్నారు. సాయంత్రం ప్రత్యేక పూల రథంపై అమ్మణ్ణిని అధిష్ఠించి మేళతాళాల మధ్య ఊరేగింపు వైభవంగా సాగింది. సాయంత్రం ఆలస్యంగా 5.30 గంటలకు ఊరేగింపు ప్రారంభమైంది. విద్యుత్తు సరఫరా నిలిపేయడంతో చీకట్లో శోభాయమానంగా సాగింది. అనంతరం విరూపోత్సవ మండపానికి రాత్రి 7.55 గంటలకు అమ్మవారు చేరుకున్నారు. విరూపణ చేయడంతో జాతర ముగిసింది. అమ్మవారి మట్టి తీసుకునేందుకు భక్తులు భారీగా పోటీ పడ్డారు.



అమ్మవారి దర్శనానికి వస్తున్న సర్వజ్ఞ యాచేంద్ర



సారె సమర్పిస్తున్న మంత్రులు కందుల దుర్గేష్, ఆనం రామనారాయణరెడ్డి



ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు



మట్టి కోసం భక్తులు, పోలీసుల పోటీ



బూరలు ఊదుతున్న మహిళలు



ఉత్తరకాలువకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయం నుంచి గురువారం ఉత్తర కాలువకు నీటిని విడుదల చేశారు. రాష్ట్ర దేవాదాయశాఖ ఆనం రామనారాయణ రెడ్డి స్విచ్ఆన్ చేసి 200 క్యూసెక్కులను కిందకు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తర కాలువకు పెన్నా జలాల విడుదల ద్వారా ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకవర్గాల రైతుల కష్టాలు, ప్రజల దాహార్తి తీరుతాయన్నారు. పది రోజులుగా ఆయా నియోజకవర్గాల రైతులు నీటిని విడుదల చేయాలని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారని.. ఆ క్రమంలో మంత్రి నారాయణతో కలిసి రైతుల కష్టాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి.. ఉత్తర కాలువ నుంచి రాళ్లపాడుకు నీటిని విడుదల చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణారెడ్డి, ఆనం కైవల్యారెడ్డి, మండల తెదేపా అధ్యక్షురాలు సునీత, సోమేశ్వరాలయ ధర్మకర్త విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 600 కోట్లతో పర్యాటకాభివృద్ధి.. సోమశిల జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ. 600 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అందులో భాగంగా చేపట్టనున్న ఎకో టూరిజం ప్రాజెక్టు శంకుస్థాపనకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తారన్నారు. పర్యాటకాభివృద్ధితో పాటు స్థానిక యువతీ యువకులకు ఉపాధి కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. గత వరదలకు దెబ్బతిన్న సోమేశ్వరాలయాన్ని రూ. 12 కోట్ల దేవాదాయశాఖ నిధులతో పునర్ నిర్మిస్తామన్నారు.

మెట్టకు జీవం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఉత్తర కాలువకు సోమశిల జలాల విడుదలతో.. మెట్ట జీవం పోసుకోనుంది. జలాశయంలో ప్రస్తుతం నీటి నిల్వ 53.27 టీఎంసీలకు చేరగా.. మరోవైపు 19032 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఈ ఏడాది ఇంకా చెరువులకు నీరు చేరేంత వర్షాలు పడలేదు. ఇక విడుదల చేసిన నీరు.. రాళ్లపాడు వరకు సుమారు 105 కి.మీ. ఉత్తర కాలువలో ప్రవహించనుంది. దీంతో భూగర్భ జలాలు పెరగనున్నాయి.

వర్షాలు కురవక ముందే... ఉత్తర కాలువ పరిధిలో 52 చెరువులు ఉండగా- మరోవైపు రాళ్లపాడు ప్రాజెక్టు ఉంది. చెరువుల పరిధిలోనే రెండు టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దాంతో అక్టోబరులో కురిసే వర్షాలకు ముందే.. చెరువులను సగం నింపాలనే ఆలోచనతో అధికారులు ఉన్నారు. వర్షాలకు మిగిలిన సగం నిండితే.. జలాలు వృథా కాకుండా ఉంటాయని యోచిస్తున్నారు.

500 క్యూసెక్కులకు పెంపు.. కండలేరు జలాశయానికి పది వేల క్యూసెక్కులు విడుదల చేస్తుండగా- పెన్నార్ డెల్టాకు వేయి క్యూసెక్కులు విడుదలవుతోంది. తాజాగా ఉత్తర కాలువకు 200 క్యూసెక్కులు విడుదల చేశారు. దీన్ని క్రమేపీ 500 క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉంది. చెరువుల్లో నీటి నిల్వ ద్వారా.. వాటి పరిధిలో వ్యవసాయ పనులు చేపట్టేందుకు వీలవుతుంది. సోమశిల ఉత్తర కాలువ ఈఈ ఎం.వి.రమణారెడ్డి మాట్లాడుతూ.. నీటి విడుదల క్రమేపీ పెంచి.. పూర్తి అవసరాల మేరకు తరలిస్తామని అన్నారు.

మనసుపెడితే.. మనోహరమే

ఈనాడు, నెల్లూరు: కలెక్టరేట్, న్యూస్‌టుడే: సువిశాల సముద్రతీరం.. ఊళ్లను ఆనుకుని ప్రవహించే పెన్నా జలధారలు.. విశిష్ట పుణ్యక్షేత్రాలు.. నిండుకుండల్లా జలాశయాలు.. అలనాటి ఘనతను చాటే కోటలు.. చారిత్రక యుగపు ఆనవాళ్లు.. వీటన్నింటి కలబోతగా ఖ్యాతినందుకున్న జిల్లాలో పర్యాటక శోభ మసకబారుతోంది. ఏళ్లు గడుస్తున్నా.. హామీలు ఆచరణకు నోచుకోక పోగా.. అరకొర నిధులతో ఆశయం ఆమడ దూరంలో నిలుస్తోంది. గతంలో తెదేపా ప్రభుత్వంలో చేపట్టిన ప్రాజెక్టులు.. చేసిన ప్రతిపాదనలు వైకాపా ఏలుబడిలో నిలిచిపోగా.. గడిచిన అయిదేళ్లలో కనీసం పట్టించుకునేవారే కరవయ్యారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పరిస్థితులపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.

పర్యాటక రంగ అభివృద్ధికి అపార అవకాశాలు

ఏళ్లుగా నిధులు లేక.. ముందుకు సాగని ప్రగతి



సువిశాల తీరం.. అభివృద్ధికి దూరం

మైపాడు, రామతీర్థం, ఇస్కపల్లి, కొత్తకోడూరు, తుమ్మలపెంట బీచ్‌లు పర్యాటకులను ఆకట్టుకుంటున్నా.. నిర్వహణ లేమి వెక్కిరిస్తోంది. కోడూరు వద్ద పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రూ.అయిదు కోట్లు వెచ్చించి నాలుగేళ్ల కిందట నిర్మించిన రెస్టారెంట్ అధ్వానంగా మారింది. తుమ్మలపెంట, రామాయపట్నంలోనూ అదే పరిస్థితి. గంగపట్నం, మైపాడు బీచ్‌లోని 40 ఎకరాల ప్రభుత్వ భూమిలో అన్ని వసతులతో పాటు బోటింగ్, స్కూటర్ రేసింగ్ వంటివి చేయాలని నిర్ణయించినా.. కార్యరూపం దాల్చలేదు.

పట్టాలెక్కితేనే.. సాహస యాత్రలు

కండలేరు పరిధిలోని తోకలపాళెం సమీపంలో రిసార్టు నిర్మాణంతో పాటు ట్రెక్కింగ్, బోటు షికారు, అడవిలో రాత్రి బస వంటి ప్రతిపాదనలు చేశారు. ఇందు కోసం 25.53 ఎకరాలు కేటాయించారు. బస చేసిన వారు తర్వాత పెంచలకోన ఆలయాన్ని దర్శించుకునే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సోమశిల, ఏఎస్‌పేట, కోట దుర్గం ప్రాంతాలను కలిపి అభివృద్ధి చేసేందుకు రూ. 63 కోట్లతో చేసిన ప్రతిపాదనలు పట్టాలెక్కలేదు. వీటన్నిటిపైనా దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.



మైపాడులో ఏర్పాటు చేసిన రిసార్ట్స్

పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రణాళికలు

– శ్రీనివాసరావు, జిల్లా పర్యాటకశాఖాధికారి

జిల్లాలో పర్యాటకాభివృద్ధికి వనరులు పుష్కలంగా ఉన్నాయి. వాటి అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించింది. రామాయపట్నం, తుమ్మలపెంట తదితర ప్రాంతాల్లో అభివృద్ధికి భూములను గుర్తిస్తున్నాం. మిగిలిన వాటికి అంచనాలు సిద్ధం చేసి.. ప్రభుత్వానికి నివేదిస్తాం. పర్యాటకరంగ అభివృద్ధి ద్వారా, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తాం.

ఉదయగిరి దుర్గం.. ఊతమిస్తే స్వర్గం

ఉదయగిరిని పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్న మాటలు.. ఎన్నికల హామీగానే మిగిలిపోతున్నాయి. ఎత్తయిన కొండలు, వాటిపై శత్రు దుర్భేధ్య కోట.. చుట్టూ ప్రాకారాలు, కనుచూపు మేరలో ప్రకృతి అందాలు.. ఇక్కడ కనువిందు చేస్తాయి. రంగనాయకుల స్వామి ఆలయం, కృష్ణ మందిరం గత వైభవానికి ప్రతీకగా కనిపిస్తాయి. ఏటా నిధులకు ప్రతిపాదనలు పెట్టినా.. నిరాశే మిగులుతోంది. రూ. 96 కోట్లు కేటాయిస్తే.. ఉదయగిరి దుర్గం.. నెల్లూరులో స్వర్గంగా మారే అవకాశం ఉంది.

ఆధ్యాత్మికం.. జిల్లాకు వరం

టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు వింజమూరు వద్ద ఉన్న నీలగిరి గృహ మల్లేశ్వరస్వామి, నరసింహస్వామి ఆలయం.. ఉలవపాళ్ల వద్ద దక్షిణాభిముఖ వీరాంజనేయ స్వామి.. బిట్రగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇందుకు రూ. పది కోట్ల అంచనాతో చేసిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. జొన్నవాడలోని మల్లికార్జున కామాక్షితాయి, పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, సీతారామపురం మండలంలోని ఘటిక సిద్ధేశ్వరం ఆలయాలనూ అభివృద్ధి చేయాల్సి ఉంది.

అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల జలాశయంలో వాటర్ ఫ్లీట్ యూనిట్‌లో భాగంగా బోట్ నడిపే సౌకర్యం కల్పించే దిశగా అధికార వర్గాలు అడుగేశాయి. ఏపీటీఏ సీఈవోకు గతంలోనే ప్రతిపాదనలు అందజేశారు. ఇప్పటికీ సాకారం కాలేదు.

పినాకిని గాంధీ ఆశ్రమాన్ని అభివృద్ధి చేసే దిశగా అడుగేశారు. నాలుగేళ్ల కిందట రూ. 1.18 కోట్ల వ్యయంతో కాటేజీలు, వసతుల కల్పనపై దృష్టి పెట్టారు. గాంధీ డిజిటల్ మ్యూజియం ఏర్పాటుకు మరో రూ. 3.55 కోట్లతో ప్రతిపాదించారు. అనేకం కాగితాలకే పరిమితమయ్యాయి.

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. ఆ మేరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి.. అభివృద్ధికి చొరవ చూపితేనే జిల్లా పర్యాటకం పురోగమన బాటలో సాగుతుంది.'



జొన్నవాడ దేవస్థానం



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

వైకాపా ప్రభుత్వంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం

ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం లక్షలాది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం నెల్లూరులో ఏపీజేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు పెంపుదల, జీతాలలో తేడా, ప్రభుత్వ పథకాల నిలిపివేత, కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం వంటి అనేక సమస్యలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. 11వ పీఆర్సీ అధికారులతో కూడిన కమిటీలు ఆమోదించి 30 శాతం వేతనాలు పెంచాలని సూచించినా.. అందుకు నిరాకరించిన వైకాపా ప్రభుత్వం కేవలం 23 శాతమే పెంచిందన్నారు. ఎక్కువ సమయం కష్టపడుతూ, తక్కువ వేతనం పొందుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం జీతభత్యాలు పెంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు అల్లం సురేష్‌బాబు, మహీధర్‌బాబు, విజయ్‌కుమార్‌తోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

గడప దాటని పనులు

వైకాపా నాయకుల అతి జోక్యంతో అసలుకే ఎసరు

న్యూస్‌టుడే, ఉదయగిరి, సీతారామపురం


గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో వైకాపా పాలనలో వీధుల్లో హడావుడి చేసిన నాటి పాలకులు, నాయకులు.. ప్రజా సమస్యల పరిష్కారాన్ని మాత్రం గాలికి వదిలేశారు. ఉదయగిరి నియోజకవర్గంలో పలు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా.. వారి అత్యుత్సాహం, అలసత్వం కారణంగా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఇంకోవైపు ప్రజలు నిత్యం అవస్థలు పడాల్సి వస్తోంది.



ఉదయగిరి పట్టణంలోని షబ్బీర్ కాలనీలోనిదీ చిత్రం.. స్థానిక మసీదు నుంచి ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా ఉన్న మట్టి మార్గం రాళ్లు తేలి అధ్వానంగా మారడంతో.. అభివృద్ధికి నిమిత్తం రూ. 3 లక్షలు మంజూరు చేశారు. పనులు చేయకుండానే.. అలాగే వదిలేశారు. రాకపోకలు సాగించేందుకు ప్రజలు నిత్యం అవస్థ పడుతున్నారు.

ఆగిన పనులెన్నో...

వైకాపా ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెండు విడతలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు అంతర్గత, దెబ్బతిన్న రహదారుల్లో నూతన సీసీ రోడ్ల ఏర్పాటుకు ఉపాధి నిధులను అనుసంధానం చేసి ప్రతిపాదించారు. వాటికి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు సైతం జారీ అయ్యాయి. రెండు విడతల్లో ఒక్కో సచివాలయానికి రూ. 40 లక్షల చొప్పున ఇచ్చారు. అన్నీ రూ. 5 లక్షల్లోపు పనులు కావడంతో పంచాయతీ తీర్మానం మేరకు నామినేషన్ పద్ధతిలో జరిగేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడే వైకాపా నాయకులు రంగ ప్రవేశం చేసి.. వారికి ఇష్టమొచ్చినట్లు వ్యవహరించారు. ఆ పనులను తమకే అప్పగించాలని పట్టుబట్టారు. కొందరు సర్పంచులు వారి ఒత్తిళ్లకు తలొగ్గి తీర్మానాలు ఇవ్వగా.. మరికొందరు ఆ పరిస్థితిని వ్యతిరేకించారు. ఇలా తీర్మానాలు ఇవ్వని చోట 'నాన్ స్టార్టెడ్'గా మిగిలిపోయి రద్దయ్యాయి. ఒక్క ఉదయగిరి మండలంలోనే సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ. 4.80 కోట్లతో 110 పనులు మంజూరు కాగా, 16 మాత్రమే పూర్తవడం గమనార్హం.



మంజూరైన నిధులు (రూ. కోట్లు)

తీర్మానాలు లేక.. ఆగాయి

ఉదయగిరి మండలంలో ఒక్కో సచివాలయానికి రూ. 40 లక్షల చొప్పున 110 ప్రాంతాల్లో సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయి. పంచాయతీ నామినేషన్‌వి కావడంతో.. తీర్మానం తప్పనిసరి. నాయకులు, సర్పంచుల మధ్య పొంతన లేని కుదరని కారణంగా తీర్మానాలు ఇవ్వలేదు. దాంతో నిబంధనల ప్రకారం మేము పూర్తి చేయలేకపోయాం. చేసిన వరకు బిల్లులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకున్నాం.

– శ్రీనివాసరాజు, ఉదయగిరి పంచాయతీరాజ్ ఏఈ

ఇదీ పరిస్థితి

మండలం	ప్రతిపాదిత పనులు	పూర్తి	ప్రారంభం కానివి
ఉదయగిరి	110	16	94
సీతారామపురం	63	43	20
వరికుంటపాడు	165	81	84
కొండాపురం	117	105	12
కలిగిరి	101	45	56
దుత్తలూరు	120	85	35
జలదంకి	58	47	11
వింజమూరు	120	120	–

విద్యార్థుల్లో విద్యార్థిగా వీసీ..

పాఠశాలకు వెళ్లిన వీసీ విద్యార్థిగా మారిపోయారు. నగరంలోని వెంగళ రావు నగర్ మున్సిపల్ పాఠశాలలో జరుగుతున్న సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ బీఈడీ ప్రాక్టికల్స్‌ను గురువారం విక్రమ సింహపురి వీసీ ఆచార్య ఎస్.విజయభాస్కరరావు పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును చూసిన అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్య కూర్చుని బోధనలు విన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. -న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)







పరదానే రక్ష!

నెల్లూరు నగరంలోని భక్తవత్సలనగర్ కెవిఆర్ నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నాడు-నేడు పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న భవనం కిటికీ లింటెల్ జులైలో కూలి విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అక్కడి అసంపూర్తి గోడల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా ఇలా పరదాలు కట్టారు. ఉపాధ్యాయులు, ఆయమ్మలు పర్యవేక్షిస్తున్నారు. -ఈనాడు, నెల్లూరు

ఇలాగైతే నీరు వచ్చేనా?



మండలంలోని గానుగపెంట మిడతవాగు నుంచి లింగన్నపాలెం, సత్యవోలు మీదుగా కొమ్మి చెరువుకు వర్షపు నీరు వస్తోంది. ఈ కాలువ కంప చెట్లు, తుంగతో నిండిపోయింది. వర్షాలు పడితే చెరువులకు నీరు సజావుగా చేరే పరిస్థితి లేదని రైతులు తెలియజేస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ జేఈ యుగంధర్‌ను వివరణ కోరగా సమస్య నా దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. -న్యూస్‌టుడే, కొండాపురం

జలవనరులశాఖలో బదిలీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: జిల్లా ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. జలవనరుల శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈ, కావలి ఎన్ఎస్ డివిజన్ ఈఈ కృష్ణమోహన్ మనుబోలు ప్రవణి సర్కిల్ ఈఈ దేవి నాయక్ లింగంగుంట ఓ అండ్ ఎం సర్కిల్‌కు బదిలీ అయ్యారు. హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్ నెంబర్ 7, అనంతపురం హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్ ఈఈ సునీల్ నెల్లూరు జలవనరుల శాఖ డ్రైనేజీ డివిజన్ ఈఈగా బదిలీపై వస్తున్నారు. ఎస్‌సీ డివిజన్ నెంబర్-2 నెల్లూరు సోమశిల ప్రాజెక్ట్ సర్కిల్, టీజీపీ తిరుపతి ఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఎన్ఎస్ డివిజన్ గూడూరు నెల్లూరు ఇరిగేషన్ పరిధి ఈఈగా బదిలీ అయ్యారు. జలవనరుల శాఖ ఎస్ఈ వచ్చేవరకు ఇన్‌ఛార్జి ఎస్ఈగా కృష్ణమోహన్ కొనసాగనున్నట్లు తెలిసింది.

రెండేళ్లలో పర్యాటక రంగానికి పూర్వ వైభవం

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.. రెండేళ్లలో పూర్వ వైభవం తీసుకువస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం నెల్లూరులోని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంటికి మంత్రి వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రపంచ టూరిజం డే సందర్భంగా శుక్రవారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సమావేశం నిర్వహిస్తున్నామని, 38 విభాగాల్లో అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని నెల్లూరు, తిరుపతి, శ్రీశైలం, కోనసీమ, విశాఖ, విజయవాడ ప్రాంతాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేశామన్నారు. పర్యాటకులు రెండు, మూడు రోజుల పర్యాటక ప్రాంతాల్లో ఉండేలా రిసార్ట్స్‌లు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. బీచ్, ఫెస్టివల్ రిసార్ట్స్‌లు, నగరవనాలు వంటివి అభివృద్ధి చేస్తామన్నారు. మెగా టూరిజం ప్రాజెక్టులో భాగంగా నెల్లూరు జిల్లాలోని కోడూరు బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరుగుతున్న పోలేరమ్మ జాతరకు తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చినట్లు తెలిపారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లిలోని కోడూరు బీచ్ అభివృద్ధి చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి వెంట జనసేన నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

వెంకటాచలం, న్యూస్‌టుడే: విద్యార్థులు సమకాలీన ప్రపంచంలో కొత్త సవాళ్లు, అవకాశాలను స్వీకరిస్తూ... లక్ష్యంతో ముందుకు సాగాలని వీఎస్‌యూ వీసీ విజయభాస్కరరావు సూచించారు. వీఎస్‌యూలో గురువారం స్టాటిస్టిక్స్, ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ... భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరాలంటే క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడేతత్వం అవసరమన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని కూడా ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు సురేశ్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపల్ విజయ, ఆచార్యులు పాల్గొన్నారు.

వసతులు కల్పిస్తే..

బాలు పేరుకు సార్థకత

అలంకారప్రాయంగా సంగీత నృత్య పాఠశాల

కళారంగంలో ప్రతిభ చూపాలనే వారు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. ఆసక్తి ఉన్న వారికి సంగీత నృత్య కళల్లో శిక్షణకు నెల్లూరులో సంగీత నృత్య పాఠశాలను ప్రభుత్వం నెలకొల్పింది. సరైన వసతులు, ఉపాధ్యాయులు లేక పాఠశాల అలంకార ప్రాయంగా మారుతోంది. కొన్ని కోర్సులు కూడా రద్దుచేశారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

పాఠశాలను 1974లో నెలకొల్పారు. ప్రస్తుతం 50 ఏళ్లు పూర్తవుతోంది. నేటికీ సొంత భవనం, పూర్తిస్థాయి సిబ్బంది లేదు. అవసరమైన పరికరాలు లేవు. జిల్లాకు చెందిన ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మరణానంతరం పాఠశాలకు ఆయన పేరు పెట్టారు. సుమారు నెలకు రూ.లక్ష పైగా అద్దె చెల్లించి నిర్వహిస్తున్నా.. అవసరమైన ఉపాధ్యాయులను నియమించడంతోపాటు వాయిద్య పరికరాలను అందిస్తేనే జిల్లా వాసులకు వరంగా మారుతుంది. బాలు పేరుకు సార్థకత చేకూరుతుంది.



నృత్య సాధనలో విద్యార్థినులు

ఉపాధ్యాయుల కొరత

వివిధ విభాగాల్లో శిక్షణను తీసుకునేందుకు ఏటా 200 మందికి పైగా విద్యార్థులు చేరుతున్నారు. కాని ఆయా విభాగాల్లో శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేటుగా శిక్షణ తీసుకుని పరీక్షలకు పాఠశాల ద్వారా హాజరవుతున్నారు. తాత్కాలిక సిబ్బందిని నియమించుకుని అందించే శిక్షణపై విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. దీంతో పాఠశాలకు వచ్చి శిక్షణ తీసుకుంటున్న వారు అరకొరగానే ఉంటున్నారు.

మూడుకోర్సులు నిలిపివేత

ఏడాదికి రూ.వెయ్యి నుంచి రూ.1500 ఫీజు చెల్లించి నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సును పూర్తిచేయొచ్చు. కోర్సు పూర్తిచేసిన వారు రెండేళ్ల డిప్లొమోను చేసుకోవచ్చు. చదువుకునే విద్యార్థులకు అనుకూలంగా పాఠశాల తరగతులను ఉదయం 7 నుంచి 9.30 వరకు సాయంత్రం 4 గంటల నుంచి 6.30 వరకు నిర్వహిస్తున్నారు. పదేళ్ల పైబడిన వారు ఈ పాఠశాల ద్వారా శిక్షణను తీసుకోవచ్చు. ప్రస్తుతం సంగీతం, భరతనాట్యం, వయోలిన్, మృదంగం, డోలు నేర్చుకునేందుకు అవకాశం ఉంది. గతంలో వీణా, వేణువు, నాదస్వరం నేర్పించేవారు.. ఈ కోర్సుల్లో ప్రస్తుతం శిక్షణ అందించేందుకు తాత్కాలిక ఉపాధ్యాయులు అందుబాటులో లేక వాటిని నిలిపివేశారు. భరతనాట్యం నేర్పించే వారే శాశ్వత ఉపాధ్యాయులుగా ఉన్నారు.



ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల

అందుబాటులో ఉన్న వారితో శిక్షణ: సి.జ్యోతిర్మయి, సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపల్



అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులతో విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నాం. సొంత భవనం నిర్మించి అవసరమైన ఉపాధ్యాయులను నియమిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

చేనేత వస్త్ర వ్యాపారులకు టోకరా

మంత్రి ఆనం వద్ద బాధితుల మొర

సంగం, న్యూస్‌టుడే: చేనేత వస్త్ర వ్యాపారులను తిరుపతికి చెందిన దంపతులు రూ.రెండు కోట్ల మేర మోసం చేసిన ఘటన తాజాగా వెలుగుచూసింది. బాధితులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆశ్రయించడంతో ఆయన ఆత్మకూరు డీఎస్పీని విచారించాలని ఆదేశించారు. వివరాల మేరకు చేనేత వస్త్ర వ్యాపారులు పెద్ద మొత్తంలో ఇతర ప్రాంతాలకు పట్టుచీరలను విక్రయిస్తుంటారు. వీరి వద్దకు మూడు నెలల క్రితం తిరుపతికి చెందిన దంపతులు వచ్చారు. మొదటగా చేజర్ల మండలం చిత్తలూరులో ఓ వ్యాపారితో పట్టుచీరల వర్తక లావాదేవీలు సక్రమంగా నిర్వహించి నమ్మకం పెంచుకున్నారు. ఈ క్రమంలో చీరలకు అధిక ధరలు చెల్లిస్తామంటూ సంగం, చేజర్ల, ఏఎస్‌పేట మండలాల్లోని వ్యాపారులను మభ్యపెట్టారు. కొంతమేర నగదు చెల్లించడంతో రూ.లక్షల విలువ చేసే పట్టుచీరలను గంపగుత్తగా ఇచ్చారు. మిగిలిన వాటికి ఈ నెల 5న చెల్లుబాటయ్యేలా చెక్కులిచ్చారు.

చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో.. వారిచ్చిన బ్యాంకు చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో తాము మోసపోయినట్లు వ్యాపారులు గ్రహించారు. ఈ వ్యవహారం తేల్చుకోవాలని ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు ఆనం రామనారాయణరెడ్డికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రూ.రెండు కోట్ల వరకు మోసపోయామని అందులో పేర్కొన్నారు. మంత్రి ఆనం స్పందిస్తూ.. పరిశీలించి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ కె.వేణుగోపాల్‌ను ఆదేశించారు. ఆయన్ను వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామన్నారు.

పొలాలు కొలిపిస్తావా అంటూ..

వైకాపా నాయకుల దాడి

తెదేపా నాయకులు బండ్ల సురేంద్రకు తీవ్రగాయాలు



కొడవలూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నాయుడుపాళెంకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు బండ్ల సురేంద్రపై స్థానిక వైకాపా నాయకులు దాడులు చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... తెదేపా సీనియర్ నాయకులు బండ్ల సురేంద్ర గురువారం సాయంత్రం కొడవలూరు తహసీల్దారు కార్యాలయం నుంచి ఇంటికి వెళుతున్నారు. నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై కాపు కాసిన మోహన్, జనార్దన్, మల్లికార్జున, తదితరులు మూకుమ్మడిగా దాడులు చేశారు. మా పొలాలు కొలిపిస్తావా అని దుర్భాషలాడారు. స్థానికులు 108కు ఫోన్ చేయగా కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్సకోసం నెల్లూరుకు తరలించారు. సీఐ కోటిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాచార స్రవంతి

నిమ్మకాయల ధరలు

పొదలకూరు (కిలో..)

పెద్దవి : రూ. 55

చిన్నవి : రూ. 75

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ.7,286
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.58,288
వెండి గ్రాము :	రూ.97.40

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	126
రిటైల్	148
లేయర్	115
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	244
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	136
లేయర్	115
బ్రాయిలర్స్	242
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	266
లేయర్ మాంసం	195

విద్యుదాఘాతంతో రైతు మృతి

పొదలకూరు, సంగం, న్యూస్‌టుడే: పొదలకూరు మండలం సూరాయపాళెంలో గురువారం ఉదయం **ప్రసాద్**(40) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందారు. సంగం గ్రామానికి చెందిన ప్రసాద్.. సూరాయపాళెంలో సుమారు మూడు ఎకరాల చేపల చెరువు సాగు చేస్తున్నారు. చేపల గుంతలకు నీరు పెట్టేందుకు విద్యుత్తు సరఫరా లేకపోవడంతో.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద టెస్టరుతో పరిశీలిస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు రోజూ సంగం నుంచి వచ్చి చేపలకు మేత, చెరువుకు నీరు పెట్టడం చేస్తుంటారని స్థానికులు తెలిపారు. ఇటీవల విద్యుత్తు సరఫరా సక్రమంగా ఉండటం లేదని, మూడేళ్లుగా గ్రామానికి హెల్పర్ కూడా లేకపోవడంతో.. ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై ఎండీ హనీఫ్ కేసు నమోదు చేసి.. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



నాడు ఆయనకు పదేళ్లు.. ఇప్పుడు బిడ్డకు..

ప్రసాద్‌కు పదేళ్ల వయసులో.. ఆయన తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి తల్లి అంకమ్మతో కలిసి కుటుంబ భారం మోస్తూ వచ్చారు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకునే స్థితిలో ఉన్నారు. ఇంతలోనే విద్యుదాఘాతం రూపంలో మృత్యువు ఆయన్ను తీసుకువెళ్లింది. మృతుడికి భార్య కోకిలతోపాటు కీర్తన, నిగ్గేష్ సంతానం. హృదయ విదారకం ఏమిటంటే.. ఇప్పుడు ప్రసాద్ కుమార్తె కీర్తన.. అదే వయసులో తండ్రి కోల్పోవడం అందరినీ కలచివేసింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

25 సవర్ల బంగారం... రెండు కిలోల వెండి అపహరణ

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు పట్టణంలో భారీ చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు... కోవూరు పోలీసుస్టేషన్‌కు కూత వేటు దూరంలో శాంతినగర్‌లో నివాసముండే ఉప్పలపాటి నాగిరెడ్డి దంపతులు 25న బుచ్చి మండలం రేబాలలో కుమార్తె వద్ద కెళ్లారు. గురువారం ఉదయం తమ ఇంటి కొచ్చారు. తలుపులు ధ్వంసం చేసి ఉండగా ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. బీరువాలో ఉన్న 25 సవర్ల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. కుమార్తె నగలు తమ వద్ద ఉంచామని, అన్నీ అపహరించారని బాధితులు వాపోయారు. నెల్లూరు గ్రామీణ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నకిలీ బంగారం తాకట్టు.. రూ.లక్షల్లో రుణం

లింగసముద్రం: మండలానికి చెందిన ఓ వ్యక్తి నకిలీ బంగారం తాకట్టు పెట్టి ప్రభుత్వ బ్యాంకు నుంచి రూ.లక్షల్లో రుణం తీసుకున్న సంఘటన గురువారం వెలుగు చూసింది. వివరాల మేరకు అయిదు నెలల క్రితం మొగిలిచర్లలోని ఓ ప్రభుత్వ బ్యాంకులో సిబ్బందిని మోసం చేసి ఓ వ్యక్తి నకిలీ బంగారం తాకట్టు పెట్టారు. నాలుగు దఫాలుగా రూ.25 లక్షల వరకు రుణం పొందారు. ఈ విషయం చర్చకు దారితీసింది. సంబంధిత బ్యాంకు అధికారులు మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఈ విషయమై విచారణ జరుగనుందన్నారు.

మాగుంట పార్వతమ్మకు కన్నీటి వీడ్కోలు

ఈనాడు, నెల్లూరు: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ అంత్యక్రియలు గురువారం నెల్లూరులో ప్రభుత్వ లాంఛనాలతో ముగిశాయి. మాగుంట అభిమానులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వారి స్వగృహంలో ఉంచారు. పార్వతమ్మ మరిది ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాగుంట కుటుంబసభ్యులను రాష్ట్రంలోని వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై నివాళులర్పించారు. మధ్యాహ్నం ప్రభుత్వ లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత పార్వతమ్మ పార్థివదేహానికి పోలీసులు గౌరవ వందనం సమర్పించి.. పోలీసు బ్యాండ్‌తో నివాళులర్పించారు. అంతిమయాత్రలో ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు. శ్మశానవాటికలో పోలీసులు గౌరవ వందనం చేశారు. ఆమెకు నివాళిగా గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఆమె మనవడు మాగుంట సుబ్బరామిరెడ్డి చేతుల మీదుగా అంత్యక్రియలు పూర్తయ్యాయి. గురువారం నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దామచర్ల జనార్దన్, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కరణం బలరాం, కంభంపాటి విజయరామిరెడ్డి, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద పోలీసుల గౌరవవందనం

తగ్గిన ఉప్పు ధరలు.. సాగుదారులకు నష్టాలు

న్యూస్‌టుడే, అల్లూరు

ఉప్పు ధరలు తగ్గడంతో సాగుదారులు నష్టపోతున్నారు. గత ఏడాది క్వింటాల్ రూ.450 వరకు అమ్మకాలు సాగాయి. ప్రస్తుతం అందులో సగానికి పతనమయ్యాయి. రూ.240 కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెద్దగా మిగలడం లేదని రైతులు చెబుతున్నారు. ఎక్కువ మంది ఎకరా నుంచి అయిదెకరాల లోపు సాగు చేసే వారు ఉన్నారు. వీరు తీసిన సరకును వెంటనే అమ్ముకుని, వచ్చిన నగదుతో మళ్లీ తయారు చేస్తుంటారు. మండలంలోని ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతాల్లో దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ఉప్పు కొటార్లు ఉన్నాయి. జిల్లాలో ఎక్కువగా ఈప్రాంతంలో ఉప్పు మడులు ఉన్నాయి. వర్షాలు లేని సమయంలో తయారీ ముమ్మరంగా సాగుతుంది. సాధారణంగా డిసెంబరు నుంచి నుంచి ఆగస్టు వరకు తయారీ ఉంటుంది. ఈ సమయంలో వర్షాలు పడితే రైతులు సుమారు రూ. ఐదు వేల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. ఈ సంవత్సరం నాలుగుసార్లు వర్షం పడింది. దీంతో తయారీ మందగించింది. వ్యాపారులు చెప్పిన ధరలకే అమ్ముకుంటున్నారు. అల్లూరు ప్రాంతం ఉప్పు ఎక్కువగా తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. తూకాల్లో మోసాలు ఉండడంతో రైతులు నష్టపోతున్నారు. గతంలో బస్తాల లెక్కన విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం ఎక్కువ మంది తూకం పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు.



తీరంలో ఉప్పు సాగు

ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటే..

ప్రస్తుతం దళారీ వ్యవస్థ నడుస్తోంది. రైతుల నుంచి వీరు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో అమ్మిన తరువాత పది రోజుల నగదు ఇస్తున్నారు. ఈ విధానం కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటే గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంది. ఇందుకు ప్రభుత్వం ఒక విధానాన్ని ఏర్పాటుచేస్తే రైతులకు లబ్ధి చేకూరుతుంది.

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

తుమ్మలపెంటను అభివృద్ధి చేస్తాం: దుర్గేశ్



మంత్రిని అభినందిస్తున్న భాజపా, జనసేన నాయకులు

కావలి, న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలపెంట సముద్ర తీరాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటించారు. గురువారం వెంకటగిరి నుంచి విజయవాడకు వెళుతూ మార్గమధ్యంలో కావలిలోని జనసేన కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుమ్మలపెంటలో వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారికి ఈ తీర ప్రాంతం తక్కువ దూరంలో ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాధు శ్రీధర్, భాజపా బాధ్యులు సీవీసీ సత్యం, కుట్టుబోయిన బ్రహ్మానందం, మందా కిరణ్, సవీంద్ర, సుజి పాల్గొన్నారు.

తెదేపా ఫ్లెక్సీల చించివేత

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటైన ఫ్లెక్సీలు ధ్వంసం వ్యవహారం దుమారం రేపింది. వీటిని తెదేపా తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు ఏర్పాటుచేశారు. వాటిపై పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర బొమ్మ ఉండడంపై ముఖ్య నేతల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఆయన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడి వర్గీయుడిగా కొనసాగుతున్నారు. దీంతో ఫ్లెక్సీల తయారీదారుడి ద్వారా చించి వేయించినట్లు ప్రచారం జరుగుతోంది.

పాఠశాలకు విరాళం

కావలి: పట్టణంలోని వైకుంఠపురం పురపాలక ప్రాథమిక పాఠశాలలో వసతుల కల్పనకు మల్లి రాము రూ.20 వేల విరాళంగా అందజేశారు. గురువారం పాఠశాలక కమిటీ ఛైర్మన్ మేఘమాల, సభ్యులు సత్యనారాయణకు ఈ మొత్తాన్ని అందించారు. వీటితో తాగునీటి ప్లాంట్‌కు మరమ్మతులు చేయిస్తున్నట్లు వారు చెప్పారు.

డెల్టా.. మరమ్మతులు చేయకుంటే ఉల్టానే!



గ్రద్దగుంట సమీపంలో పూడికతో నిండిన కాలువ

న్యూస్‌టుడే, అల్లూరు

అల్లూరు డెల్టాలో కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. పూడిక, ఆక్రమణలతో రూపు కోల్పోయాయి. అయిదేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో నీరు పారే పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు సాగుకు కర్షకులు సన్నద్ధమవుతున్నారు. ఈప్రాంతంలో 45 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. కాలువలకు హడావుడిగా కాకుండా ముందస్తుగా మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. అల్లూరు, రామన్న, పురిణి, ఇందుపూరు చెరువుల ఆధారంగా వేలాది ఎకరాల్లో సాగు జరుగుతోంది. వీటి నుంచి పొలాలకు వెళ్లే కాలువల్లో పూర్తి స్థాయిలో పూడిక తొలగించాలంటే నెల రోజులకు పైగా సమయం పడుతుంది. ఆక్రమణలతో కుచించుకుపోయిన వాటిని సర్వే చేసి నీరు సాఫీగా అందించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అల్లూరులో కోనేరు, మిట్ట, నాగాలమ్మ, ఇస్కపల్లి కాలువలు, సింగపేటలో గ్రామం మధ్యలో పోయే రెండు ప్రధాన కాలువలు ఉన్నాయి. ఇందుపూరు, పురిణి చెరువుల ప్రధాన కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి.

గతంలో అంతా హడావుడే

కొన్నేళ్లుగా పూడిక తొలగింపు పేరుతో హడావుడిగా ఆకు తొలగిస్తున్నారు. దీంతో రెండుసార్లు తవ్వాల్సి వచ్చేది. కొన్నిచోట్ల రెండుసార్లు బిల్లులు చేసుకున్న సందర్భాలున్నాయి. ఒకసారి జల వనరుల శాఖ నిధులు, మరోసారి ఉపాధి హామీ నిధులతో చేసి లబ్ధి పొందారు. ఈ విషయమై జల వనరుల శాఖ సూపర్‌వైజర్ అల్లాను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని వివరించారు.

ఆక్రమణలు తొలగించాలి: రమణారావు, అల్లూరు

ప్రధాన కాలువల ఆక్రమణలు తొలగించాలి. ఇరువైపులా పక్కా నిర్మాణాలు ఉన్నాయి. వీటి కారణంగా పూడిక తీయలేకపోతున్నారు. అధికారులు సమస్యపై చర్యలు తీసుకోవాలి.

అక్రమార్కులపై చర్యలేవీ?



పట్టణ పరిధిలో లెక్కకు మిక్కిలిగా అనధికార లేఅవుట్లు ఉంటే అయిదు మాత్రమే ఉన్నాయని అధికారులు సమాచారం ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మెతక వైఖరి అవలంబిస్తున్నారు. ఇది విమర్శలకు తావిస్తోంది.

న్యూస్‌టుడే, కావలి

వైకాపా నాయకులు పురపాలక పరిధిలో నుడా అనుమతి పొందిన లేఅవుట్లు అయిదు మాత్రమేనని స.హ చట్టంలో దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై తెదేపా వర్గం ఆగ్రహించి ఈనెల 16వ తేదీన అధికారులతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించింది. స.హ చట్టం ప్రకారం ఇచ్చిన వివరాలు అసంపూర్తిగా ఉన్నాయని, ఇదంతా తమ కార్యాలయం సిబ్బంది తప్పిదమని ఆ సందర్భంలో కమిషనర్ అంగీకరించారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పదిరోజులైనా వారిపై చర్యల్లేవు. ఇదే సమావేశంలో తహసీల్దార్ కావలి మండల పరిధిలో భూవినియోగ మార్పిడి (కన్వర్షన్) వివరాలు తన వద్ద సిద్ధంగా లేవని ప్రకటించారు. ఈ సమావేశానికి అనుకోకుండా రావడంతో ఇలా జరిగిందని స్పష్టంచేశారు.

లోకాయుక్త దృష్టికి..

పురపాలక పరిధిలో అడ్డగోలుగా జరుగుతున్న ప్రభుత్వ భూముల ఆక్రమణల వ్యవహారం లోకాయుక్త దృష్టికి కూడా వెళ్లింది. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలకు తప్పుడు నివేదికలు ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. నీటి వనరులకు సంబంధించి సర్వే చేసి జలవనరుల శాఖకు నివేదికలు ఇవ్వడం పూర్తైనట్లుగా రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. జలవనరుల శాఖ మాత్రం నివేదికలు ఇవ్వలేదని చెప్పడం విశేషం.

ధ్వంసం చేసిన నీటిగుంతలో ఏర్పాటైన స్థిరాస్తి క్షేత్రం

నుడా అనుమతుల్లోనూ

ప్రభుత్వ అనుమతులు పొందిన అయిదు లేఅవుట్లలో కుంటలు, కాలువలు, ఇతర ప్రభుత్వ భూములు ఉన్నాయి. నుడా అధికారుల తనిఖీల్లో కాలువలు అలాగే చూపించారు. ఆ తరువాత ఆక్రమణకు పాల్పడ్డారు. పుర పరిధిలో ఇప్పటివరకు 120 ఎకరాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణ జరిగినట్లు గుర్తించారు. అందులో 70 ఎకరాల వరకు కాలువల భూమిని స్వాధీనం చేసుకున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం

స్థిరాస్తి క్షేత్రాల వ్యవహారంలో సమగ్ర రీతిలో చర్యలు తీసుకుంటున్నాం. ఇకపై ఆక్రమణలు ఎక్కడా జరగకుండా చూస్తున్నాం. ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందిస్తున్నాం. ఆయా స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులు కూడా రావు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: రామ్మూర్తిపేట అడపాల వారి వీధిలో చెత్త పేరుకుపోయింది. **- జోలాపురం నాగరాజు, రామ్మూర్తిపేట**

సమాధానం: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **-ఎం. శ్రీనివాసులురెడ్డి, ఏఈ, పురపాలక సంఘం - న్యూస్‌టుడే, కావలి,**

? ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి గువ్వాడి, (వయా) పామూరు సర్వీసును అధికారులు రద్దు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. **- హరి, గువ్వాడి**

✓ డ్రైవర్ల సమస్య ఉంది. పునరుద్ధరిస్తాం. **- శ్రీనివాసరావు, మేనేజర్, ఉదయగిరి డిపో**

? మండలంలోని పూరేటిపల్లి ప్రధాన వీధిలో చిన్నపాటి వర్షానికే మురుగు నీరు నిలుస్తోంది. **-ఎస్. జోషికుమార్**

✓ పారిశుద్ధ్య సిబ్బందితో పూడికతీయించి సమస్య పరిష్కరిస్తాం. **- సుమలత, పంచాయతీ కార్యదర్శి గుడ్లూరు, న్యూస్‌టుడే**

సబ్ రిజిస్ట్రార్‌కు వీడ్కోలు

వింజమూరు : స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ బదిలీపై వెంకటగిరికి వెళుతున్న సయ్యద్ మహబూబ్‌బాషాకు గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. బదిలీపై వెళుతున్న జూనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసులు, సబ్ రిజిస్ట్రార్‌ను సన్మానించారు.

బార్‌లో ధ్వంసంపై కేసు నమోదు

కావలి, న్యూస్‌టుడే: బార్‌లో ఫర్నిచర్ ధ్వంసం చేసిన ఉదంతంపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలోని వెన్నెల బార్‌లో కొద్దిరోజుల క్రితం దాడులు జరిగాయి. దీనిపై బాధితుడు దద్దాల శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు తాతా తిరుపతి, హరిబాబుతో బాధితుడికి వివిధ కారణాలతో వివాదాలున్నాయి.

విలేకరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కావలి : పట్టణ శివారులో డి.శ్రావణకుమార్ అనే ఓ ఛానల్ (ఈనాడు కాదు) విలేకరిపై దాడి జరిగింది. గురువారం పట్టణం నుంచి స్వగ్రామం జలదంకి మండలంలోని అన్నవరం వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. దారిన పోతున్న వారు నిందితులను అడ్డుకుని పంపించారు. వారు వెళ్లిపోగానే మరో పది మంది వెంబడించారు. దీంతో అతను బుడంగుంటలో దాక్కొని పోలీసులకు సమాచారమిచ్చారు. అతన్ని కావలిలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. రెండో పట్టణ ఎస్సై గౌస్ కేసు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు.

నిర్లక్ష్యం అల్లుకుంటోంది!



వరికుంటపాడు వింజమూరు మండలంలోని మాధవనగర్ సమీపంలో రోడ్డు పక్కనే విద్యుత్తు స్తంభాలకు పిచ్చిమొక్కల తీగలు అల్లుకుపోయాయి. వర్షం సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడడంతోపాటు ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మూగజీవాలు అటుగా వెళుతూ పిచ్చిమొక్కలు తగిలితే విద్యుత్తు సరఫరా అయి ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు వెంట ఉన్న అన్ని విద్యుత్తు స్తంభాలకు ఇదే పరిస్థితి. వారం రోజుల్లో తొలగిస్తామని లైన్‌మెన్ వెంకటేశ్వర్లు తెలిపారు. **-న్యూస్‌టుడే, వరికుంటపాడు**

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు



గ్రామంలో వీధి కుక్కలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ఇటీవల వెలమబజారులో ముగ్గురిని గాయపరిచాయి. మాంసం దుకాణాల వద్ద పెద్ద ఎత్తున చేరుతున్నాయి. ఆయా రోడ్లలో వెళ్లేందుకు జనం జంకుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, వింజమూరు**

కాలువ ఇలా.. మురుగు పారేదెలా..?

నలదలపూరు ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు.. రాళ్లు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో మురుగు ముందుకు కదలడం లేదు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన సిబ్బంది దృష్టి సారించడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై ఈవోఆర్డీ సుమంత్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, వలేటివారిపాలెం**



పాతస్తంభాలు వేస్తే ఎలా?



ఈ చిత్రం జలదంకి మండలంలోని నాగిరెడ్డిపాలెం వ్యవసాయ క్షేత్రంలో కనిపిస్తున్న విద్యుత్తు స్తంభం. అక్కడ గతంలో స్తంభాన్ని ఓ బరి రైతు మరో ప్రాంతానికి తరలించారు. దీనిపై 'ఈనాడు'లో ప్రత్యేక కథనం ప్రచురితమవడంతో ఎట్టకేలకు డిస్కం అధికారులు స్పందించారు. అక్కడ తిరిగి లైన్‌ను ఏర్పాటు చేస్తుండగా, స్తంభాలు మాత్రం 1989లో తయారైన వాటిని అమరుస్తుండడాన్ని రైతులు తప్పుబడుతున్నారు. ఈ విషయమై ఎస్పీడీసీఎల్ కావలి డీఈ బెనర్జీ స్పందిస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కావలి, జలదంకి**

వరద బాధితులకు టీఆర్ఆర్ కళాశాల విరాళం

కందుకూరు పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రూ.1.23లక్షలు విరాళాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు గురువారం అందజేశారు. బోధన, ఇతర సిబ్బంది ఒకరోజు వేతనం రూ.1.11లక్షలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమకూర్చిన రూ.12వేలను కలిపి రూ.1.23 లక్షల చెక్కు ఆయనకు అందించారు. ప్రిన్సిపల్ డాక్టర్.రవికుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని ఏడో వార్డు, విక్కిరాలపేట రహదారిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ ఛైర్మన్ చల్లా శ్రీనివాసరావు తల్లి లక్ష్మమ్మ దశదినకర్మ కార్యక్రమం ఓగూరులో జరగ్గా ఎమ్మెల్యే పాల్గొన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజి తదితరులు నివాళులర్పించారు.

వ్యవస్థలను గాడిలో పెట్టిన సీఎం : కాకర్ల

కలిగిరి, న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థలన్నింటినీ చంద్రబాబు 100 రోజుల పాలనలో గాడిలో పెట్టారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని క్రాకుటూరులో గురువారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కరెంటు లైన్‌మెన్ అవినీతికి పాల్పడుతూ ఇబ్బందులు పెడుతున్నట్లు పలువురు రైతులు ఎమ్మెల్యే ఎదుట మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచి గోగుల మంజుల, ఎంపీటీసీ సభ్యులు హరిశ్చంద్రారెడ్డి, నాయకులు ఎం.చిరంజీవిరెడ్డి, బి.వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీసీ కండక్టరుకు అస్వస్థత

లింగసముద్రం : విధుల్లో ఉన్న ఆర్టీసీ కండక్టరు అస్వస్థతకు లోనైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మొగిలిచర్ల నుంచి కందుకూరు బస్సు వెళుతుంది. ఆ సమయంలో కండక్టరు నరసింహం అస్వస్థతకు గురికావడంతో పడిపోయారు. డ్రైవర్ డిపో అధికారులకు సమాచారమిచ్చారు. కందుకూరులోని ఆసుపత్రికి తరలించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గుడ్లూరు : గ్రామంలో నిర్మాణంలో ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన రామాల అంజిరెడ్డి రూ.50వేల విరాళం అందజేశారని కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు వేణు, రాఘవులు, సోమానాయుడు, రామచంద్రారెడ్డి, సుధాకర్ తదితరులు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

జలదంకి : ఇటీవల జరిగిన విద్యుత్తు ప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన జమ్మలపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మైనంపాటి వినోద్‌కుమార్ కుటుంబానికి రెడ్‌క్రాస్ మండల శాఖ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి రూ.3 వేలు నగదు, సామగ్రి అందించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డి.రవిప్రకాష్, జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీ

జలదంకి : పోలేరమ్మ ఆలయంలోని హుండీలో నగదు చోరీ చేసిన సంఘటన మండలంలోని గోపనపాలెంలో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు ఊరి బయట ఉన్న ఆలయంలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. అందులో సుమారు రూ.20 వేల వరకు నగదు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

పరిసరాల అనుసంధానంగా బోధన

ఉదయగిరి : పరిసరాలను అనుసంధానిస్తూ విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని ఎంఈవో మస్తాన్‌వలి సూచించారు. మండలంలోని కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాల మెయిన్, జడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్లపడియ ప్రాథమికోన్నత పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి, పద్మనాభరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటుకు పాటుపడాలి

ఉదయగిరి : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎం.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏ.నరసింహులు పేర్కొన్నారు. ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని గురువారం కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఫడ్స్ డైరెక్టరు పీవీ రమణయ్య, భాజపా నాయకుడు రోశయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ఉదయగిరి : మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కల్లూరి మోహన్‌రెడ్డి గురువారం రూ. 10 వేల విలువైన బ్లూటూత్ మైక్‌సెట్‌ను ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో బోడబండ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయిని ప్రశాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ఉదయగిరి : వ్యాసరచన పోటీల విజేతలకు గురువారం బహుమతుల ప్రదానం జరిగింది. జమాతే ఇస్లామి హింద్ ఉదయగిరి శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ పేరుతో మోసపోవద్దు' అనే అంశంపై ఇటీవల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ పోటీ పెట్టారు. ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైద్యుడు అఖిల్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఆసియా, నిర్వాహకులు అల్సానియా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

29న డీఎస్సార్‌లో ఉచిత వైద్య శిబిరం

అల్లూరు: గ్రామంలోని డీఎస్సార్ ట్రస్ట్‌లో ఈనెల 29న ఉచిత వైద్యశిబిరం జరుగుతుందని నిర్వాహకులు గురువారం తెలిపారు. వైద్య నిపుణులు రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారన్నారు.

ఘనంగా సాయిబాబా పల్లకిసేవ

దగదర్తి : దగదర్తిలోని సాయిబాబా ఆలయంలో గురువారం రాత్రి స్వామి వారికి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, సాయంత్రం భక్తులు సామూహిక సాయి సచ్చరిత్ర పారాయణం చేశారు.

మద్యం స్వాధీనం..

ఉలవపాడు : రామాయపట్నంలో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు.

కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు.. ఎండుతున్న పంటలు



తమిదపాడులో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మరు

వింజమూరు, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు కాలిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఓల్టేజి హెచ్చుతగ్గులు, ఉరుములు, మెరుపులు, పిడుగుల పడడం వంటి కారణాలతో కాలిపోయిన వాటి స్థానంలో కొత్తవి అమర్చకపోతుండంతో రైతులు నష్టపోతున్నారు. తమిదపాడులో ఉరుములు, మెరుపులు పిడుగులకు 20 రోజుల క్రితం ఒకే రోజు 16, 25 కేవీ సామర్థ్యం గల ఎనిమిది దెబ్బతిన్నాయి. మాధవనగర్‌లో మొలబంటి రాఘవేంద్ర, జయరాములు, చింతనబోయిన పెంచలయ్య, మొలబంటి శ్రీనివాసులు, లోకసాని కాంతమ్మ, తమిదపాడుకు చెందిన మండాది అనసూయమ్మ తదితరుల పొలాల్లోనివి కాలిపోయాయి. అధికారుల చుట్టూ తిరుగుతున్నా కొందరికి ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై డిస్కం ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో 20 ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాల్సి ఉందన్నారు. ప్రాధాన్య క్రమంలో ఇస్తున్నామన్నారు.

పార్వతమ్మ సేవలు ఎనలేనివి: రామిరెడ్డి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

కావలి, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి దివంగత మాగుంట పార్వతమ్మ చేసిన సేవలు ఎనలేనివని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ట్రంకురోడ్డుకు ఆమె పేరు పెట్టాలనే ప్రతిపాదనతో ఏకీభవిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

మనుబోలు : మనుబోలు బీసీకాలనీలో బాణాసంచా పేలుళ్ల సంభవించి తీవ్రంగా గాయపడిన బాధితులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబీకులను ఆయన పరామర్శించారు. గాయపడిన గిరీష్, శంకరయ్య, పెంచలయ్య, లోకేశ్‌లకు ఒక్కొక్కరికి రూ. 20వేలు చొప్పున అందజేశారు. మిగతా రూ.20 వేలు నగదును కాలనీలోని బాధితులను అందజేయాలని యువతకు సూచించారు.

జొన్నవాడలో విశేష పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవార్లకు గురువారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలువురు ప్రముఖులు, భక్తులు వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఐలాండ్‌ను అభివృద్ధి చేయాలని వినతి

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు మండలంలోని ఊటుకూరు పల్లిపాలెంలోని ఐలాండ్‌ను పర్యాటక కేంద్రంగా ప్రకటించి అభివృద్ధి చేయాలని కోవూరు నియోజకవర్గ తెదేపా నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు వినతిపత్రం గురువారం అందజేశారు. వెంకటగిరి జాతర నేపథ్యంలో మంత్రి జిల్లాకు రావడంతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన్ను కలిసి సమస్యను వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : విడవలూరు మండలం దంపూరు నుంచి గొల్లొందారు తోపు వరకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు లేవు. రాత్రి సమయాల్లో చీకట్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు**

సమాధానం : విద్యుత్‌శాఖకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి**

? పొదలకూరు మండలం బత్తులపల్లి హరిజనవాడ విద్యుత్తు స్తంభాలు లేక తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. వెంటనే స్తంభాలు ఏర్పాటు చేయాలి. **- శ్రీహరి నాయుడు, గ్రామస్థుడు.**

✔ స్తంభాలు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే ఏర్పాటు చేయిస్తాం. **- డిస్కం ఏఈ శ్రీకాంత్**

? సంగంలోని గ్రంథాలయం వద్ద వీధి దీపం వెలగకపోవడంతో రాత్రిళ్లు ఇబ్బందికరంగా ఉంటుంది. **- బి.రత్నం**

✔ వెంటనే మరమ్మతులు చేయించి దీపాలు వెలిగేలా చూస్తాం. **- కె.శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వెంకటాచలం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొలగమూడిలో గురువారం జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని పారిశుద్ధ్యం మెరుగు కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ... అందరూ పరిసరాల పరిశుభ్రతను పాటించడంతో పాటు, మొక్కలు నాటే సంకల్పించాలని కోరారు. 'పర్యవరణ - పరిశుభ్రత' కోసం త్వరలో సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం, డీపీవో సుస్మిత రెడ్డి, పలువురు అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న సోమిరెడ్డి, అధికారులు

అదనపు గదుల నిర్మాణంపై ఆనం ఆగ్రహం

రాపూరు, న్యూస్‌టుడే: పెంచలకోన ఆలయం వద్ద దుకాణదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే అధికారులు ఏం చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలకోన పుణ్యక్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించగా ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయగా అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆలయానికి సంబంధించిన ఆరు గదులను టెండర్ ద్వారా దక్కించుకున్న వ్యాపారులు చేపట్టిన పనులను చూసి అధికారులను నిలదీశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంకటగిరిలో పోలేరమ్మ జాతర సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నెల్లూరు వెళుతుండగా తానంచెర్ల వద్ద నాయకులు ఆయన కాన్వాయ్‌ను ఆపి స్వాగతం పలికారు. రాపూరు మాజీ ఎంపీపీ బాలకృష్ణారెడ్డి వ్యవసాయ తోటలో భోజనం చేసి నెల్లూరుకు పయనమయ్యారు.

మాగుంట పార్వతమ్మ మృతి తీరని లోటు

కొడవలూరు, బుచ్చి : మాజీ ఎంపీ, ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతి జిల్లా ప్రజలకు తీరని లోటని కోవూరు మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. తాను తొలిసారి 2004లో ఎమ్మెల్యే కాగా, కావలి ఎమ్మెల్యేగా గెలిచిన మాగుంట పార్వతమ్మ సొంత సోదరిలా అభిమానం చూపించేవారన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

మనుబోలు : మండలంలో జగనన్న కాలనీల్లోని గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో గృహనిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న సుమారు 260 ఇళ్లను, డిసెంబరులోగా పూర్తిచేయాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లు నిర్మించేందుకు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు.

గ్రామస్థుల చైతన్యం.. ఇక్కట్లకు మోక్షం



కొలగట్ల ఎస్సీ కాలనీ సమీపం నుంచి ఆలయ రహదారి గురువారం ఉదయం వరకు ఇలా



మరమ్మతుల అనంతరం ఇలా..

కొలగట్ల (సంగం), న్యూస్‌టుడే: చిన్న చినుకు పడినా.. చిత్తడవుతున్నా.. ఆ మార్గంలో రాకపోకలు చేయాలంటే కత్తిమీద సాములాంటి నల్లే.. అయిదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో విసిగెత్తిన గ్రామస్థులు.. తామే రోడ్డు నిర్మించేందుకు ముందుకు కదిలారు. ఇందుకు ఒక దాత చేయూతనివ్వడంతో అయిదేళ్ల దుస్థితికి చరమగీతం పాడారు.

అడుగు వేయాలంటే..

ఈ గ్రామంలో మసీదు సమీపం నుంచి నాగవరపమ్మ ఆలయం వరకు, పెన్నానది సమీపంలోని ఎస్సీ కాలనీ వరకు సుమారు రెండు కి.మీ పొడవైన రోడ్డు మార్గం దారుణంగా దెబ్బతింది. పెన్నానదికి సమీప ప్రాంతం కావడంతో ఇసుకతో నిండి ఉండేది. చినుకు పడితే బురదమయంగా మారుతుండేది. పొలాలకు వెళ్లాలన్నా.. వ్యవసాయ, మత్స్య ఉత్పత్తులను తరలించాలన్నా.. ఆలయానికి వెళ్లాలన్నా.. అవస్థలు తప్పేవి కావు. ప్రజాప్రతినిధులను, అధికారులను అయిదేళ్లుగా గ్రామస్థులు వేడుకున్నా.. స్పందన కార్యక్రమాల్లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది.

దాత సహకారంతో..

ఎంతకీ పరిస్థితి మారకపోవడంతో తామే రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నడుం బిగించారు. అంతా కలిసి సుమారు రూ.లక్షనైన నిధులు సమీకరించారు. సొంత ట్రాక్టర్లను వినియోగించి పనులు పూర్తి చేశారు. నెల్లూరు కిమ్స్ వైద్యశాల ఎండీ టి.గిరినాయుడికి తమ సమస్యను వివరించారు. దీంతో రోడ్డుకు అవసరమైన వెటుమిక్స్, కంకర ఇతర సామగ్రి అందించారు. వీటిని సంగం నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలించి రహదారిని అభివృద్ధి చేసుకున్నారు.

ఇసుక తరలిస్తున్న ఎడ్లబండ్ల అడ్డగింతపై ఫిర్యాదు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: పెన్నానదిలో ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న వారిని ట్రాక్టర్ డ్రైవర్లు అడ్డుకున్న ఘటన గురువారం ముదివర్తిపాలెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గంగపట్నం గ్రామానికి చెందిన కొందరు పది ఎడ్లబండ్లతో రోజూ పెన్నానదిలో ఇసుక తీసుకెళుతున్నారు. ఈ క్రమంలో మా ఊరిలో ఉన్న ఇసుకను బండ్ల ద్వారా ఎలా తీసుకెళతారంటూ ట్రాక్టర్ డ్రైవర్లు అల్లెయ్య, మరొకరు వాటికి అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి వాగ్వాదానికి దిగారు. ఎడ్లబండ్లలోని ఇసుకను కింద పోసి వారిని దౌర్జన్యంగా తరిమేశారు. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

ఆత్మకూరు : ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ అశ్వనీపురం ఉర్దూ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. వారి సామర్థ్యాలను పరీక్షించారు. ప్రధానోపాధ్యాయుడు ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత కోవూరు లక్ష్యం

కోవూరు, న్యూస్‌టుడే: క్యాన్సర్ రహిత కోవూరే తన లక్ష్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కోవూరు పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్యశిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కలెక్టరుతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికులకు ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్య కార్డులను అందిస్తామన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలను కొనియాడారు. ప్రతి మూడు నెలలకోసారి పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి వెంకటగిరి పోలేరమ్మ జాతరలో పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను వేమిరెడ్డి దంపతులు ప్రత్యేకంగా కలిసి కోవూరులోని కనిగిరి రిజర్వాయర్, మైపాడు బీచ్, పల్లిపాడులోని గాంధీ ఆశ్రమాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరారు.

జలాశయానికి 19,032 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే, సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం నాటికి 19,032 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 317.900 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. 77.988కి 53.275 టీఎంసీలు నిల్వ ఉంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 5, పవర్ టన్నల్ ద్వారా 1000 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్ డెల్టాలైన ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువ ద్వారా కండలేరు వరద కాలువకు 10,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 260 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

కాలనీ వాసులకు ఫ్లోరైడ్ లక్షణాలు

పొదలకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అంకుపల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాల పిల్లలకు జిల్లా ఫ్లోరైడ్ అధికారిణి, వైద్యురాలు దివ్య దంత పరీక్షలు నిర్వహించారు. కాలనీ వాసులు కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం విచారించామన్నారు. పిల్లల దంతాలపై గారపట్టి ఉందన్నారు. భూగర్భంలో ఫ్లోరైడ్ కలిసి ఉంటుందని, అది నీటిలో కలిసి వస్తోందన్నారు. అవి తాగితే కాళ్లు, వేళ్ల వంకర పోవడం, దంతాలు గారపట్టడం, కడుపులో మంట మూత్రపిండాల సమస్యలు వస్తాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానంగా ఉన్న నీటిని వినియోగించొద్దన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి రవికుమార్, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

కుక్కలతో భయం.. భయం..



బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ప్రధాన కూడలిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో అటుగా వెళుతున్న వారిపై దాడులు చేస్తున్నాయి. నగర పంచాయతీ ప్రజలు చిన్నపిల్లల్ని వీధుల్లోకి పంపించాలంటే హడలిపోతున్నారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కౌన్సిల్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, బుచ్చి**

క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ

మండలంలోని నరసాపురం ఎంవీఆర్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటారని ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు పేర్కొన్నారు. కోవూరులో ఈనెల 24, 25, 26 తేదీల్లో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-14, 17 బాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, పరుగు పందెం, లాంగ్ జంప్, రిలే పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులకు గురువారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. **- న్యూస్‌టుడే, ఇందుకూరుపేట**



అవయవదానంతో జాతికి మేలు



అవయవదానంతో జాతికి మేలు జరుగుతుందని హెచ్‌ఎం ఓబులేసు తెలిపారు. కొడవలూరు మండలంలోని నార్తురాజుపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సింహపురి దేహ సమర్పణ సంస్థ ఆధ్వర్యంలో రక్త, నేత్ర, దేహ దానాలపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు నరేంద్ర దేహ సమర్పణ అంగీకారపత్రాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో అవయవదానంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. **- న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం**

శ్మశానం వాటిక ఏర్పాటుపై నిరసన

కోవూరు పట్టణంలోని గుమ్మళ్లదిబ్బలో ముస్లింలకు శ్మశాన స్థలాన్ని ఇండ్ల సమీపంలో కాకుండా దూరంగా ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు గురువారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మాజీ ఎంపీపీ రమణమ్మ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ముస్లింలకు శ్మశానం ఏర్పాటు చేసేందుకు తమ నివాసాల సమీపంలో స్థల పరిశీలన చేశారన్నారు. దూరంగా ఏర్పాటు చేయాలని తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గుమ్మళ్ల దిబ్బకాలనీ వాసులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, కోవూరు**



భక్తిశ్రద్ధలతో ఉత్సవం



ఏఎస్‌పేటలోని ప్రసిద్ధ దర్గా హజరత్ ఖాజానాయబ్‌రసూల్ 251వ గంధోత్సవం సందర్భంగా గురువారం ఝులాల(దర్గా గుమ్మటం పైన ఉన్న చంద్రవంకను పూల అల్లికలతో అలంకరించడం) ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా దర్గా వక్ఫ్‌బోర్డు కార్యాలయం నుంచి ఈవో మహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఝులాను ఫకీర్ల జరబులతో తీసుకెళ్లి దర్గాపై ఉన్న చంద్రవంకపై అలంకరించారు. **- న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట**

పొగాకు రైతులకు మొక్కల పంపిణీ

మర్రిపాడు, న్యూస్‌టుడే: డీసీపల్లి పొగాకు బోర్డులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పొగాకు రైతులకు నేరెడు, టేకు, తెల్లమద్ది, ఎర్రచందనం మొక్కలను పంపిణీ చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. పొగాకు క్యూరింగ్‌కు మొక్కలు నరకడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, ప్రతి రైతు తమ పొలంలో ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు.

వ్యాసరచన పోటీలు

కోవూరు: సామాజిక సమరత వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీహరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, పద్యపోటీలు నిర్వహించి విజేతలకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

బుచ్చి: నగర పంచాయతీలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో కంటి వైద్య పరీక్షలు గురువారం జరిగాయి. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి మనోజ్ పర్యవేక్షణలో విద్యార్థులు పాల నేత్ర పరీక్షలు చేయించుకున్నారు.

చాకలి ఐలమ్మకు నివాళి

సంగం, న్యూస్‌టుడే: తెలంగాణ యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని సంగంలో రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సంఘం నాయకులు ఈ. మాల్యాద్రి, బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

అడ్డుకట్టవేసి.. ఆపై ఆక్రమించి



చెరువులో కట్టలు వేసి చదును చేసిన ఆక్రమణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గండ్లవీడు చెరువు ఆక్రమణలకు గురవుతోంది. నీటినిల్వ ప్రాంతంలో అడ్డుకట్టలు వేసి ఆపై చదునుచేసి యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. వర్షాధారంగా రైతుల అవసరాలు తీర్చే ఈ చెరువు సోమశిల హైలెవల్ కాలువ రెండో దశపనులు పూర్తయితే శాశ్వత సాగునీటి వనరుగా అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో ఆక్రమణల పర్వం రైతులకు తీవ్ర నష్టం కలిగించనుంది.

దాదాపు 1800ఎకరాలకు సాగునీటి అవసరాలు తీరుస్తుంది. కాగా కావేరి వాగు ప్రధాన వనరుగా నిర్మించిన ఈ చెరువు నీటినిల్వ ప్రాంతంలో చౌటపల్లి, గుండెమడకల, గండ్లవీడుకు రెవెన్యూకు చెందిన పొలాలు ఉన్నాయి. వింజమూరు మండలానికి చెందిన ఓ రైతు గతంలో కుంట చేను అంటూ చెరువు సమీపంలోని పొలం 9.5ఎకరాలు కొని జామాయిల్ వేశాడని.. ఆ క్రమంలోనే పక్కన ఉన్న మరో రెండు ఎకరాలు ఆక్రమించారని స్థానిక రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది నీరు నిల్వ ఉండే ప్రాంతంలో 10ఎకరాల వరకు భూమిని చదును చేశారు. దీంతో నీటినిల్వ విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం చెరువు పరిధిలో ఒక పంట సజావుగా పండాలంటే నీరు చాలక ఇబ్బందులు పడుతున్నామని ఇలా.. ఆక్రమిస్తున్నా పట్టించుకునే వారులేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెరువు ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణకు గురయినట్లు తెలితే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

మాముడూరు నరసింహులు, సర్పంచి గండ్లవీడు

చెరువులో అడ్డుకట్టలు వేసి ఆక్రమిస్తున్నారు. వర్షాలు లేక పంటల సాగులేక పోవడంతో రైతులు అటువైపు వెళ్లడం లేదు. దాంతో ఆక్రమించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి

చెరువు విస్తీర్ణమే..

పెంచలయ్య, రైతు

కట్టలు వేసి ఆక్రమించిన స్థలం చెరువు విస్తీర్ణమే. నీరు ఆ ప్రాంతంలో నిల్వ ఉంటుంది. ఇక్కడ దశాబ్దాలుగా సాగు చేసింది లేదు. ఆక్రమణదారుడిది మా ఊరు కాదు. పరిశీలించి చెరువును సంరక్షించాలి.

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

మనుబోలు, బుచ్చి, న్యూస్‌టుడే: అనుమతుల్లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని మనుబోలు ఎస్సై రాకేశ్ హెచ్చరించారు. మనుబోలులో బాణసంచా విక్రయించే దుకాణదారులకు నోటీసులు అందజేశారు. అనుమతి తీసుకున్న వారు మాత్రమే విక్రయించాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, హోంగార్డు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. బుచ్చిలో అధికారులు మాట్లాడుతూ దీపావళి పండగ సందర్భంగా బాణసంచా విక్రయించాలంటే అనుమతి పొందాలన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే: స్టేట్‌బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు. తోటపల్లిగూడూరులో గురువారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. రుణాలు మంజూరు, రికవరీ, బ్యాంకు సేవలు, కౌలు రైతులకు అందించే సేవలపై అవగాహన కల్పించారు.

క్షేత్రసహాయకుడిపై చర్యలు తీసుకోండి

అనంతసాగరం, ఏఎస్‌పేట, న్యూస్‌టుడే: కచిరదేవరాయపల్లికి చెందిన క్షేత్రసహాయకుడు వెంకటరమణ అవకతవకలకు పాల్పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం ఎంపీడీవో మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా అసభ్యకరంగా మాట్లాడుతూ పనికి వచ్చినా.. మస్టరు వేయడం లేదని తెలిపారు. విచారణ చేపట్టి తగిన చర్యలు చేపడతామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ఏఎస్‌పేట మండలం అక్బరాబాదులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

పోలేరమ్మ జాతరకు తరలిన భక్తులు

సైదాపురం, రాపూరు, బుచ్చి, న్యూస్‌టుడే : వెంకటగిరి పోలేరమ్మ జాతరకు గురువారం సైదాపురం మండలం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఏటా జాతర వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఈ ప్రాంతంలో ఆనవాయితీ. మండలంలోని మర్లపూడి, చాగణం, చీకవోలు, సైదాపురం, తలుపూరు, ఊటుకూరు, గిద్దలూరు గ్రామాల నుంచి భక్తులు ఆటోలు, ట్రాక్టర్లు, ప్రైవేట్ వాహనాల్లో తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. బుచ్చి మండలం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. రాపూరు డిపో మేనేజరు అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. బుధ, గురువారాల్లో జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆరు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

కొండచిలువ సంచారం

సైదాపురం, న్యూస్‌టుడే: మండలంలోని చీకవోలు గ్రామంలో బుధవారం రాత్రి కొండచిలువ సంచరించడంతో స్థానికులు హడలిపోయారు. ఎగువపల్లె వీధిలో కోడిని మింగుతున్న క్రమంలో గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో స్థానికులు హతమార్చినట్లు తెలిపారు.

సమన్వయంతో నిర్దేశిత లక్ష్యాలు సాధ్యం

సైదాపురం, న్యూస్‌టుడే: అధికారుల సమన్వయంతో పనిచేస్తే నిర్దేశిత లక్ష్యాలు సాధించాలని ఎంపీడీవో శివకుమార్ సూచించారు. 2024-25లో లక్ష్య సాధన కోసం చేపట్టాల్సిన చర్యలపై గురువారం వివిధ శాఖల అధికారులతో ఆయన చర్చించారు. అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: దేవర చిత్రం విడుదల సందర్భంగా తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూరు మండలంలోని మూడు పేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులు, పండ్లు పంపిణీ చేశారు. సభ్యులు రామకృష్ణ, జయంత్, నవీన్, సుబ్బరాయడు తదితరులు పాల్గొన్నారు

పోషకాహార మాసోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని ఖాజానగర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మలత, హబీబున్నీసాల ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు గురువారం జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శకుంతల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు.

అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఆత్మకూరు, చేజర్ల, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 100రోజుల పాలన సాగించిందని ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు గురువారం చెర్లోయడవల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెదేపా పార్లమెంటరీ నియోజక వర్గ కార్యదర్శి రావి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో చేజర్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

బీసీజీ టీకాతో క్షయ నివారణ

అనంతసాగరం, న్యూస్‌టుడే: క్షయ నివారణకు బీసీజీ టీకా ఎంతో సురక్షితమని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. గురువారం మండల పరిధిలోని రేవూరు, పాతదేవరాయపల్లి గ్రామాల్లో నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీలో గురువారం రాత్రి అతివేగంగా వెళుతున్న ఆటో దామరమడుగు వద్ద బోల్తా పడింది. ఆటోలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు వచ్చి ఆటోను లేపి డ్రైవర్‌ను మందలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

చేజర్ల : పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం రాత్రి ఉలవపల్లి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు.

భూ వివాదంలో ఆత్మహత్యాయత్నం

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు తహసీల్దారు కార్యాలయం వద్ద బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన నిమ్మల నాగార్జున ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం జరిగింది. బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దారు కార్యాలయం వద్ద భూవివాదంలో తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. కొంత సేపటికి తన వెంట తెచ్చుకున్న పెట్రోలుతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అక్కడున్న వారు అప్రమత్తమై నిలువరించారు. బాధితుడు మాట్లాడుతూ.. తాత నిమ్మల బలరామయ్యకు విడవలూరు మండలం చౌకచర్లలో 4.32 సెంట్ల పట్టా భూమి ఉంది. బలరామయ్యకు బావ అయిన నిక్కుదల లక్ష్మయ్యకు కౌలుకిచ్చారు. పొలానికి సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన లక్ష్మయ్య వారి కుటుంబ సభ్యుల పేరుతో పొలం మార్చుకున్నారని వాపోయారు. బంధువులైన వారి మధ్య కొన్నేళ్లుగా భూవివాదం నెలకొంది. ఇరువురి ఫిర్యాదులతో రెవెన్యూ కోర్టులో పదేళ్లుగా కేసు నడుస్తోంది. ఉన్నతాధికారులు విచారించి తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని నిమ్మల నాగార్జున వేడుకుంటున్నారు. దీనిపై తహసీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ సివిల్ వివాదం కోర్టు పరిధిలో ఉండటంతో తీర్పు వచ్చే వరకు తాము జోక్యం చేసుకోలేమన్నారు.



విడవలూరు తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు కుటుంబీకులు

నెల్లూరు
•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

కేజీబీవీల్లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ)లో ఒప్పంద ప్రాతిపదికన, బోధన, బోధనేతర, పొరుగుసేవకులుగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్ ఉషారాణి ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ-15, సీఆర్టీ-6, పార్ట్‌టైమ్ టీచర్లు-7, అకౌంటెంట్-1 ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అక్టోబరు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని.. వివరాలకు నగరంలోని ఎస్ఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మించండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: సుందరయ్య కాలనీ హైవే జంక్షన్ వద్ద బాక్స్ టైప్ బ్రిడ్జి(అండర్ పాస్), సర్వీస్ రోడ్డు విస్తరణ నిర్మాణం చేయాలని తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి వినతి ద్వారా కోరారు. జాతీయ రహదారుల కార్యాలయంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంకే.చౌదరిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో ఎరుకల కులస్థులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు రమణయ్య, రామారావు, బుజ్జయ్య, వెంకయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్ డిక్లరేషన్‌పై సంతకం చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్.. డిక్లరేషన్ సమర్పిస్తానని బహిరంగ ప్రకటన చేయాలని సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకులు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో అలిపిరి వద్దే సనాతన ధర్మపరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో దర్శనానికి వెళ్లకుండా అడ్డుకుంటామని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)


స్వర్ణాల చెరువు ఘాట్

నెల్లూరు పర్యాటక శోభను సంతరించుకుంది. ఓ వైపు పెన్నా పరివాహక ప్రాంతం.. మరో వైపు ప్రముఖ ఆలయాలు, బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు, నగరవనం పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. జిల్లా ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే పర్యాటకులు, భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

కులమతాలకు అతీతం బారాషహీద్

దేశంలోనే కులమతాలకు అతీతంగా జరుపుకొనే పండుగ బారాషహీద్‌దర్గా రొట్టెల పండుగ. రాష్ట్రంలో పాటు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, రాజస్థాన్ తదితర రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. బారాషహీదులను దర్శించుకుని పక్కనే ఉన్న స్వర్ణాల చెరువులో స్నానమాచరించి ఘాట్‌లో సేదదీరుతారు. ఘాట్‌కు ఆనుకునే ఏపీ టూరిజం బోట్ షికార్ ఉండటంతో స్వర్ణాల చెరువులో పెద్దలు, చిన్నారులు విహరించే అవకాశం కల్పించారు.


నెల్లూరు బ్యారేజీ

పర్యాటక శోభ.. నెల్లూరు బ్యారేజీ

పెన్నానదిపై నిర్మించిన బ్యారేజీ పర్యాటక శోభను సంతరించుకుంది. ఓ వైపు పెన్నమ్మ పరవళ్లు తొక్కుతుంటే.. మరోవైపు రంగురంగు విద్యుద్దీపాలతో బ్యారేజీ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. సాయంత్రం వేళ నగరవాసులు కుటుంబ సభ్యులతో కలిసి సేదతీరుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు బ్యారేజీని చూసి సెల్ఫీలు దిగుతున్నారు.


శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం

జిల్లాకే తలమానికం

నెల్లూరు- పొదలకూరు రోడ్డులోని నగరవనం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. దాదాపు రూ.2కోట్లతో అభివృద్ధి చేశారు. కొండ, అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. రంగురంగుల పూల మొక్కలు, జంతువుల ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. రోజూ నాలుగు వేల మంది వరకు సందర్శకులు వస్తున్నారు.

ప్రముఖ ఆలయాలకు నిలయం

జిల్లాకు వచ్చే పర్యాటకులు నెల్లూరు దర్గామిట్టలో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటుంటారు. ప్రతిరోజూ భక్తులు పూజలు చేస్తున్నారు. శుక్రవారం రోజు రాహుకాల పూజలకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ● పెన్నానది తీరాన రంగనాయకులపేటలోని శ్రీతల్పగిరి రంగనాథ స్వామి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. గాలిగోపురం నెల్లూరుకే తలమానికంగా నిలుస్తోంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో భక్తులు దర్శించుకుంటున్నారు.

నేడు ఉద్యోగుల భవిష్యనిధి సమావేశం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ నెల్లూరు ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నిధి ఆప్కే నిఖత్ 2.0 కార్యక్రమం ఈనెల 27న జరగనుందని అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ అమితాబ్ శుక్ల, సమాచార అధికారి వల్లూరు సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని రామలింగాపురం శ్రీసాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో జరిగే కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిబ్రవరి నాటికి జాతీయ రహదారుల పనులు పూర్తిచేయండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో నేషనల్ హైవే అథారిటీ, ఆర్అండ్‌బీ శాఖల పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ రహదారుల పనుల ప్రగతిపై ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పనులు పూర్తిచేయాలని కోరారు. పనులకు అవసరమైన గ్రావెల్ తీసుకునేందుకు అనుమతివ్వాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు ఇబ్బంది లేకుండా ఇసుక అందిస్తామని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెన్నానది ఎన్‌హెచ్-67పై జరుగుతున్న వంతెన నిర్మాణం, ఎన్‌హెచ్-167 బీజీ సీతారామపురం-దుత్తలూరు-కావలి రహదారి, 167బి మూడు ప్యాకేజీల పనులు మైదుకూరు-సింగరాయకొండ తదితర పనులపై సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జేసీ కార్తీక్, ఎన్‌హెచ్‌పీ డీఎం కె.చౌదరి, ఆర్అండ్‌బీ డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సమస్య: మైపాడురోడ్డు కిసాన్‌నగర్ సింహపురి కాలనీ మహాలక్ష్మి గుడి ఎదురు రోడ్డులో ఎస్ఎఫ్6/ఎ3/ఎస్ఎఫ్3డీఎఫ్, ఎస్ఎఫ్6/ఎ1 స్తంభాలకు విద్యుద్దీపాలు 20 రోజులుగా వెలగడం లేదు. – బాజీరావు

? చంద్రమౌళినగర్ 10వ వీధి చివర రైల్వే ట్రాక్ సమీపంలో వీధిలైటు వెలగడం లేదు. – రాధాకృష్ణ

సమాధానం: విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. – సూర్యతేజ, కమిషనర్

? సుందరయ్యకాలనీలో కాలువల పూడికతో నిండిపోయాయి. దుర్గంధం వస్తోంది. – శారద

✓ కాలువల్లో పూడిక తీయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

మంత్రి నారాయణను కలిసిన అబ్దుల్ అజీజ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన అబ్దుల్ అజీజ్ గురువారం మంత్రి పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ● మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతి తీరనిలోటని అబ్దుల్ అజీజ్ అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని మాగుంట నివాసంలో పార్వతమ్మ భౌతికకాయానికి గురువారం ఆయన నివాళులు అర్పించారు.

జాతీయస్థాయి గుర్తింపు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: బాలకార్మిక చట్టాలు, వ్యవస్థ, వెట్టిచాకిరిపై సమగ్ర అధ్యయనం చేయడంతోపాటు వారిని పనులు, వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయించి, విద్యాబుద్ధులు నేర్పించిన నెల్లూరు స్పందన ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు జాలా మాణిక్యరావుకు జాతీయస్థాయి గుర్తింపు, ప్రశంసాపత్రాన్ని అందించారు. గురువారం దిల్లీలోని వీవీగిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ నుంచి పత్రాన్ని అందుకున్నారు.

ఏమారితే అంతేమరి



నెల్లూరు నగరంలోని పోలీసు కాలనీలో గుంత ప్రమాదకరంగా మారింది. వారం రోజుల క్రితం పైపులైను మరమ్మతులు కోసం సిమెంటు రోడ్డు మధ్యలో గుంత తవ్వారు. పనులు ముగిసిన తర్వాత మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు కర్రలను అడ్డుగా పెట్టారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని ఎస్ఈ సంపత్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

ముక్కుమూసుకోవాల్సిందే

ఫత్తేఖాన్‌పేట రైతుబజారు పక్క వీధిలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. రోడ్డంతా పరచుకోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. నిత్యం ఇదే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. వ్యర్థాలను పశువులు కలియబెడుతుండటంతో దుర్గంధం వస్తోందని, ప్రతిరోజూ తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. తొలగిస్తామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



పోలీసుమైదానం చెంతే ప్రమాదం



నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మానందపురంలో పోలీసు మైదానం గోడకు పక్కనే నియంత్రిక ప్రమాదకరంగా మారింది. దాని చుట్టూ ఉన్న రక్షణ గోడ ఆరు నెలల క్రితం కూలిపోయింది. అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఈఈ శ్రీధర్ స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

పూడిక తీయరా!

నెల్లూరునగరం నీలగిరి సంఘం మలుపులోని పంట కాలువలో పూడిక తీసి వ్యర్థాలను ప్రధాన రోడ్డుపై వేశారు. అవి ఎండిపోయినా తొలగించలేదు. మలుపు కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణం వ్యర్థాలను తొలగిస్తామని నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



కుంగిన సిమెంట్ రోడ్డు



నగరంలో మినీబైపాస్ నుంచి గోమతీనగర్‌కు వెళ్లే సిమెంట్ రోడ్డు కుంగిపోయి గుంతలు పడి వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు కొంతమేరకే నిర్మించింది. నిర్మాణ సమయంలో నాణ్యత పాటించక పోవడంతో.. భారీ వాహనాల రాకపోకలతో గుంతలుపడి దెబ్బతింటోందని రోడ్డును త్వరగా బాగుచేయించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(రంగనాయకులపేట)

బంగారం రికవరీలో గందరగోళం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ఓ చోరీ కేసులో బంగారం రికవరీ విషయం గందరగోళానికి దారి తీసింది. తెదేపా నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నెల్లూరు గ్రామీణంలో ఇటీవల దొంగతనం జరిగింది. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు పోలీసులకు చిక్కాడు. నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం చోరీ చేసిన బంగారాన్ని నగరంలోని ఓ జ్యువెలరీ దుకాణంలో విక్రయించాడు. విచారణలో భాగంగా దుకాణ యజమానిని పోలీసులు పిలిపించారు. 38 గ్రాముల నల్లపూసల దండకు సంబంధించి రికవరీలో భాగంగా 18 గ్రాముల బంగారం రికవరీ చేయించేలా ఒప్పందం జరిగింది. అందులో భాగంగా గురువారం రికవరీ చేసేందుకు వ్యాపారి స్టేషన్‌కు వెళ్లగా బంగారం శాతంపై సంధి కుదరలేదు. పోలీసులేమో 90 శాతం టచ్ ఇవ్వాల్సిందేనని పట్టుబడగా, బంగారం వ్యాపారి మాత్రం 70 శాతం టచ్ ఇస్తానని చెప్పి భీష్మించుకున్నారు. ఈ క్రమంలోనే తెదేపా నాయకులు ధర్మవరం సుబ్బారావు స్టేషన్‌కు వచ్చారు. నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు తెదేపా నాయకుల సెల్‌ఫోన్లు లాక్కున్నారు. వాగ్వాదంలో ధర్మవరం సుబ్బారావు చేతికి గాయమైంది. అనంతరం తెదేపా నాయకులు పోలీసు స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. గ్రామీణ సీఐ వ్యవహార శైలిపై నిరసన చేశారు. విషయం తెలుసుకున్న నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివాదాన్ని సర్దుబాటు చేశారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా గురువారం రెండో డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ, అన్నదానం, డివిజన్ తెదేపా అధ్యక్షుడు మేకల అనిల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ముఖ్యఅతిథిగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. రామలింగాపురం సెంటర్ డివిజన్ పార్టీ ఇన్‌ఛార్జి మదన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో, బెజవాడ మేమూన్ సింగ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కలివెలపాళెం తెదేపా కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. నెల్లూరు(విద్య) అంబేడ్కర్ భవన్‌లో గురువారం తెదేపా గ్రామీణ యువత, ఎస్సీ నాయకుల ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. **నెల్లూరుటౌన్:** బారాషహీద్ దర్గాలో ముస్లిం మైనార్టీలు దువా నిర్వహించి అన్నదానం చేశారు.


వృద్ధురాలికి దుస్తులు పంపిణీ చేస్తున్న గిరిధర్‌రెడ్డి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన అనుమతులు ఉల్లంఘిస్తే ప్రారంభ స్థాయిలోనే నిర్మాణాలు ఆపేయాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. గురువారం మాగుంట లేఅవుట్, ముత్యాలపాళెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న భవన నిర్మాణాన్ని పరిశీలించి తనిఖీ చేశారు. అనుమతులు మేరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయా అని విచారించి సిబ్బందితో కొలతలు తీయించారు. అనంతరం పరిసరాలను పరిశీలించి ఖాళీ స్థలాల్లో 'ఇచ్చట చెత్త వేయరాదు.. జరిమానా విధించబడును' అనే సూచికను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


భవనానికి కొలతలు తీయిస్తున్న కమిషనర్

భూసేకరణ వేగవంతం చేయాలి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రాజెక్టులు, రైల్వే లైన్ నిర్మాణాల కోసం చేపట్టిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన భూములకు బిల్లులు చెల్లించాలని సూచించారు. పెండింగులో ఉన్న భూసేకరణ ప్రతిపాదనలు వెంటనే కలెక్టరేట్‌కు పంపించాలని ఆదేశించారు. జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ పూజా, నెల్లూరు, కావలి ఆర్డీవోలు మాలోల, శీనానాయక్, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ పద్మావతి, జాతీయ రహదారుల పీడీ ఎంకే చౌదరి, తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విద్యాసాగర్, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ రంగబాబు, ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు తీసుకుని ఇవ్వలేదని ఫిర్యాదు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: కోటమిట్టలో నివాసం ఉంటున్న షేక్ జరినా టైలర్ పని చేస్తుంటారు. స్థానికంగా ఉంటున్న గిద్దలూరి హరితతో స్నేహంగా ఉంటున్నారు. హరిత శుభకార్యాలకు వెళ్లినప్పుడల్లా జరీనా వద్ద బంగారు ఆభరణాలు తీసుకుని వెళ్లి తిరిగి వచ్చేవారు. ఇటీవల జరీనా నుంచి నాలుగు సవర్ల జత బంగారు గాజులు, నల్లపూసల గొలుసు తీసుకున్నారు. వారం రోజులు గడిచినా తిరిగి ఇవ్వలేదు. ఆభరణాలు ఇవ్వాలని ఇంటికెళ్లి అడగ్గా.. బలవంతం చేస్తే ఎస్సీ, ఎస్టీ కేసు కింద ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. బాధితురాలు జరీనా గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

నెల్లూరు (నేర విభాగం): ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఎస్‌కే అమీనాబీ వెంకటగిరిలోని తన సోదరి ఇంటికి వెళ్లేందుకు గురువారం ఆర్టీసీ బస్టాండు వద్దకు వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో మెడలోని మూడు సవర్ల బంగారు చైన్‌ను కొందరు లాక్కెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదం.. దాడి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: పాత స్థలం విషయంలో అన్నదమ్ములు దాడులకు పాల్పడిన ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. సాదా సుబ్బారావు, బాబుకి మధ్య పాత స్థలం గొడవలు ఉన్నాయి. కేసు కోర్టులో కూడా నడుస్తోంది. గురువారం బాబు కుమారుడు దినేష్ కోర్టు నుంచి వచ్చిన నోటీసు స్థలం వద్ద అంటిస్తుండగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బాబాయ్‌పై సోదరుడి కుమారుడు దినేష్ ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడ్డాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెల్లూరు(నేర విభాగం): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు మండలం గుమ్మలదిబ్బకు చెందిన ఏడుకొండలు, పావని(41) దంపతులు. వారు ఈ నెల 23న ఇస్కపల్లిలో బంధువుల ఇంట్లో శుభకార్యక్రమంలో పాల్గొని బైక్‌పై తిరిగి గుమ్మలదిబ్బకు బయల్దేరారు. భగత్ సింగ్ కాలనీ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు కింద పడ్డారు. తీవ్రగాయాలైన పావని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కాలుష్యాన్ని నివారించి ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందని జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొణతం భాస్కర్ అన్నారు. గురువారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూప్స్ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నర్సింగ్ విద్యార్థులతో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ జరిగింది.

దళితుల సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు(కలెక్టరేట్): జిల్లాలోని మాదిగల భూ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ కోరారు. గురువారం కలెక్టర్ ఒ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ పి.విజయమ్మపై కక్షసాధింపు చర్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మాదిగపల్లెల్లో శ్మశాన సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలశాఖ జీఎం బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా పరిశ్రమల శాఖ జీఎంగా ఎన్ఎస్ఆర్‌సీఎం మారుతి ప్రసాద్ గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను అదనపు జిల్లా ఆరోగ్య శాఖాధికారి షేక్ ఖాదర్‌వలి, జిల్లా మాస్ మీడియా అధికారి కె.కనకరత్నం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఇద్దరు అధికారుల నియామకం

నెల్లూరు(కలెక్టరేట్): బదిలీల్లో భాగంగా గురువారం అధికారులను నియమించారు. సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డీడీగా శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈడీగా బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి నియమితులయ్యారు.

స్పందనకు వందనం: రోడ్డుకు మరమ్మతులు



నెల్లూరు గ్రామీణ మండలంలోని ఫత్తేఖాన్‌పేట శాంతినగర్ ప్రధాన రోడ్డుపై ఉన్న రాళ్లను చదును చేశారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గుంతలు పూడ్చారు. 'శాంతినగర్‌లో సమస్యల తిష్ఠ' శీర్షిక ఈనెల 25న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఫిట్టర్ రాజా పర్యవేక్షణలో కార్మికులు రోడ్డును చదును చేశారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

తెరపై ఈనాడు

ఎం-1 సినిమాస్– స్క్రీన్1.. స్క్రీన్-2, స్క్రీన్3.. దేవర, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)– స్క్రీన్1..స్క్రీన్2..స్క్రీన్3..స్క్రీన్4..స్క్రీన్5.. దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1..స్క్రీన్2.. స్క్రీన్3..స్క్రీన్4..దేవర, సిరిమల్టీప్లెక్స్.. స్క్రీన్1..స్క్రీన్2.. స్క్రీన్3..దేవర

కుమ్మరుల ఆత్మీయ సమావేశం 29న

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: నెల్లూరు కొత్తూరు- అంబాపురంలో ఉన్న శాలివాహన సంక్షేమ భవనంలో కుమ్మరుల ఆత్మీయ సమావేశం ఈనెల 29న జరగనుందని కుమ్మరి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు సుమన్ ప్రజాపతి తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మూణ్నాళ్ల ముచ్చటే
రాళ్లు తేలిన సిమెంటు రోడ్లు


అనుసంధానం చేయని బారకాసులోని రోడ్డు

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడాల్సిన సిమెంటు రోడ్లు రాళ్లు తేలుతున్నాయి. లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్లు ఆరునెలలకే రూపురేఖలు మారిపోతున్నాయి. ఒకసారి నిర్మించిన సిమెంటు రోడ్డు సంవత్సరాల పాటు మన్నికతో ఉండాలి. కానీ నగరంలో గుత్తేదారుల ధనదాహం.. ఇంజినీరింగ్ అధికారుల ఉదాసీనత కారణంగా మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి.

హడావుడిగా...

నెల్లూరు నగరం 150 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉండగా.. 54 డివిజన్లు ఉన్నాయి. దాదాపు 1.56 లక్షల గృహాలు ఉండగా.. దాదాపు పది లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. నగరపాలకసంస్థ పరిధిలో ఎన్నికలకు ముందు వైకాపా ప్రభుత్వం హడావుడిగా సిమెంటు రోడ్లను నిర్మించింది. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.40 లక్షలతో సిమెంటు రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మాణం చేపట్టారు. ఆయా డివిజన్లలో పనులను కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల అనుచరులు దక్కించుకున్నారు.

అంతా నాసిరకం..

నగరంలోని 166 సచివాలయాల పరిధిలో దాదాపు రూ.100 కోట్లతో పనులు చేపట్టారు. పనులు జరిగే సమయంలో పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. దీంతో గుత్తేదారులు నాణ్యతకు తిలోదకాలిచ్చారు. సిమెంటు కన్నా ఇసుక ఎక్కువగా కలిపి రోడ్లు నిర్మించడంతో పాటు క్యూరింగ్ కూడా చేసిన దాఖలాలు లేవు. ఆరు నెలలు కూడా గడవకముందే సిమెంటు రోడ్లు రాళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.


పోలీసు కాలనీలో రహదారి దుస్థితి

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

దెబ్బతిన్న రహదారుల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని.. కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కొత్తవి నిర్మించాలని నగరవాసులు కోరుతున్నారు. ● నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడుతూ పరిశీలించి బాగు చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

రైలులో గంజాయి సరఫరా

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ వద్ద రైల్వే సీఐ భుజంగ రావు తన సిబ్బందితో గురువారం తనిఖీలు నిర్వహించగా, చెన్నైకు చెందిన లెనిన్, అమ్మాయిప్పన్ అనుమానాస్పదంగా ఉండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను పరిశీలించగా అందులో 5 కేజీల గంజాయి ఉన్నట్లు నిర్ధరించారు. రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. ఒడిశా నుంచి చెన్నైకు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.